# సింగిల్ పేజీ కథలు

## ఎత్తుకు పై ఎత్తు

రాజు బయటకు వెళ్లడానికి సిద్ధంగా వున్నాడు. ఇంతలో తలుపు తోసుకుని, చేతిలో రివాల్వర్‌తో ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు. రాజుతో సమానమైన ఎత్తు, ఒడ్డూ పొడుగుతో వున్నాడు. మొహం మీద నల్లటి ముసుగు వుంది.

"హ్యాండ్సప్ రాజు- ఇప్పుడు నువ్వు ఇక్కడినుంచి కదలటానికి వీల్లేదు. కదిలితే కాల్చేస్తా" అంటూ రివాల్వర్‌ను రాజుపై గురిపెట్టి వుంచాడు జానీ.

"నీకేం కావాలి?"

"నిన్ను చంపటానికే వచ్చాను."

"ఎందుకు?"

"నిన్ను చంపి, నీ స్థానంలో నేను రాజుగా చలామణీ అవుతాను."

"నీకంత అవసరం ఏమొచ్చింది?"

"నేను బ్యాంకులో డబ్బు దోచుకుని పారిపోయి వస్తూ వుండగా పోలీసులు నన్ను తరుముకొస్తున్నారు. మార్కెట్‌లో జనం మధ్యగా తప్పించుకు తిరుగుతున్నప్పుడు నువ్వు నాకు కనపడ్డావు."

"నావలన నీకు ఉపయోగం ఏముంటుంది?"

"నువ్వు సరిగ్గా నా ఆకారంలో, నా ఎత్తున వున్నావు. నీ మొహం, నా మొహం తేడాగా వున్నాయి. నేను నల్లటి ముసుగు మొహానికి వేసుకున్నాను కాబట్టి నన్ను పోలీసులు గుర్తుపట్టలేరు. నీ స్థానంలో నేను వుంటే పోలీసులు నావెంట పడరు. అందుచేత నిన్ను చంపి, ఈ ఇంట్లో నీ స్థానంలో నేను వుంటాను."

"అది సరే. నేను రాజు అని నీకెట్లా తెలుసు?"

"నిన్ను ఎవరో మార్కెట్లో పిలవడం, నువ్వు అతనితో మాట్లాడటం అన్నీ గమనించి నీ వెనకాలే నీవెంట పడి నీ ఇంటికి వచ్చాను."

"ఇంతకీ నువ్వు నన్ను చంపి, నా స్థానంలో వుండి పోలీసుల నుంచి తప్పించుకుందామని అనుకుంటున్నావన్నమాట" అని రాజు విరగబడి నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావు? నిన్ను చంపుతానంటే నీకు భయంగా లేదా?"

రాజు మళ్లీ గట్టిగా నవ్వి "ముందు నీపేరు చెప్పు" అన్నాడు.

"జానీ"

"చూడు జానీ- నువ్వు నా గురించి చాలా పొరపాటు పడ్డావు."

"కబుర్లు చెప్పి తప్పించుకోవాలని చూస్తే కాల్చి చంపుతా."

"నువ్వు బ్యాంకులో డబ్బు దోచుకుంటే, నేను ఒక జ్యుయలరీ షాపులో కొన్ని లక్షల రూపాయల విలువ చేసే బంగారు నగలు దొంగిలించాను. నీలాగానే నేను కూడా పారిపోయి వస్తుంటే పోలీసులు నన్ను తరుముకొచ్చారు. ఎట్లాగో తప్పించుకుని ఇంటికి చేరుకున్నాను. ఏ



క్షణంలో అయినా వాళ్లు ఇక్కడకు రావచ్చు."

జానీ ఆశ్చర్యంగా వింటున్నాడు.

"నా స్నేహితుడిని ఈ రోడ్డు మలుపులో వుంచి, పోలీసులు ఇటువైపు వస్తే నాకు వెంటనే ఫోను చెయ్యమని చెప్పాను. అతని దగ్గర సెల్‌ఫోన్ వుంది. అతని ఫోన్‌కాల్ కోసం ఎదురుచూస్తున్నాను."

"ఫోను రాగానే ఏం చేద్దామనుకుంటున్నావు?" అడిగాడు జానీ ఆరాటంగా.

"అక్కడ బల్లమీద సంచిలో ఏమున్నాయో చూడు- నీకే తెలుస్తుంది."

జానీ సంచి లోపల చూసి "దానిలో ఒక కోటు, టోపీ, నల్లద్దాల కళ్లజోడు, విగ్గు, మీసాలు వున్నాయి."

"పిచ్చి జానీ- ఇప్పటికైనా నా ప్లానేమిటో నీకర్థమైందా? వాటితో మారువేషం వేసుకుని పారిపోతాను. నువ్వు కూడా మారువేషంలో పారిపోవాలంటే నీకు కూడా అలాంటివి ఇవ్వడానికి నేను రెడీ. ఇద్దరం కలిసి పారిపోదాం."

"నీ సలహా బాగానే వుంది."

ఇంతలో ఫోను మోగింది. శేఖర్ రాజుకి ఫోను చేశాడు.

"పోలీసులు వస్తున్నారు. అందుకనే నా స్నేహితుడు ఫోను చేశాడు. వెంటనే నువ్వు ఆ గదిలోకి వెళ్లి, నీకు కావాల్సిన దుస్తులు తీసుకుని వేషం మార్చుకో. ఆ గది వెనుక వైపున దొడ్డిగుమ్మం వుంది. ఆ గుమ్మం బయట, ఫోను చేసిన నా స్నేహితుడు నాకోసం ఎదురుచూస్తూ వుంటాడు. నువ్వు క్షణాలలో రెడీ కావాలి. ఇద్దరం కలిసి తప్పించుకుపోదాం."

వెంటనే జానీ ఆ గదిలోకి వెళ్లాడు. లోపల రకరకాల దుస్తులు వున్నాయి. జానీ వాటిని చూస్తుండగానే, నిశ్శబ్దంగా రాజు ఆ గది తలుపు గడియపెట్టి, తాళం కూడా వేశాడు. రాజు ఫోనులో "శేఖర్, మన నాటకానికి కావాల్సిన దుస్తులన్నీ తీసుకువస్తున్నాను. నువ్వు వెంటనే ఇక్కడికి సబ్-ఇన్‌స్పెక్టర్‌ను తీసుకురావాలి. బ్యాంకు డబ్బు దోచుకున్న ఒక దొంగను ఇక్కడ గదిలో బంధించాను."

గది లోపల జానీ, బయట గడియపెట్టి వుందని కనిపెట్టి, రాజు తన ఎత్తుకు పై ఎత్తు వేసి తనని బంధించాడని గ్రహించాడు.

కొంచెం సేపట్లో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, ఇద్దరు పోలీసులతో శేఖర్ వచ్చాడు. జానీని పోలీసులు అరెస్ట్ చేశారు.

"నువ్వు చాలా తెలివిగా దొంగలా నటించి, నమ్మించి, అసలు దొంగను బంధించి మాకు అప్పగించి చాలా సహాయం చేశావు" అని సబ్-ఇన్‌స్పెక్టర్ రాజును మెచ్చుకున్నాడు.

-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి (హైదరాబాద్)